దిగుబడి అంతంతే..!

- అడుగంటిన భూగర్భ జలాలు
- అయోమయంలో రైతులు
- ఆరుతడి వైపు మొగ్గు చూపాలంటున్న అధికారులు


వరిగుంతం పీఏసీఎస్ పరిధిలో ఆరబోసిన వరి ధాన్యం

కొల్చారం(నర్సాపూర్): ఈసారి వరి పంట దిగుబడి అంతంతే అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో కోటి ఆశలతో వరి పంట సాగు చేసిన రైతులకు చీడపీడల రూపంలో, అడుగంటిన భూగర్భ జలాలతో సాగుకు పెట్టిన పెట్టుబడి డబ్బులు వస్తే అదే గొప్ప అంటున్నారు కొల్చారం మండల రైతులు.

పంట సాగు విస్తీర్ణం....

మండలంలో యాసంగి వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం 17,350 ఎకరాలు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం సాగు చేసింది 16,600 ఎకరాలు. ఇది గత యాసంగి సాగు కంటే 2 శాతం ఎక్కువ. మండలంలో అత్యధికంగా పంటల సాగు బోర్లపై ఆధారపడి సాగు కొనసాగుతోంది. దశాబ్ద కాలం నుంచి నీటి ఆధారిత పంట వరికే ఇక్కడి రైతులు ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారు. సమీపంలో మంజీరా నది ప్రవహించడం, నదిపై ఐదు ఎత్తిపోతల పథకాలు, మూడు చెక్ డ్యాములు నిర్మించినప్పటికీ వేసవికాలం వచ్చిందంటే భూగర్భ జలాలు తగ్గిపోతుండడం ప్రతీసారి ఇదే పరిస్థితి. రైతులు మాత్రం వెనకడుగు వేయకుండా యథావిధిగా పంటను సాగు చేశారు. పంట వేసిన మొదటి నుంచే చీడపీడలు అత్యధిక స్థాయిలో పంటను ఆశించడం, పంట ఈని గింజ తొడిగే వరకు మందులను పిచికారీ చేస్తూనే వచ్చారు. ఇందుకోసం అత్యధిక డబ్బులను వెచ్చించారు. ఈ పరిస్థితుల్లోనే భూగర్భ జలాలు ఒక్కసారిగా అడుగంటడంతో బోర్ల కింద వేసిన పంట ఎండిపోయింది. ఎండిపోయిన పంటపై వ్యవసాయ అధికారుల నివేదిక రావాల్సి ఉంది. అనధికార లెక్కల ప్రకారం దాదాపు 1200 ఎకరాల్లో పంట ఎండిపోయింది.

ఎకరంన్నరకు 40 బస్తాల ధాన్యం



నాలుగు రోజుల కిందట ఎకరం పంటను కోత కోయగా 40 బస్తాలకు మించి ధాన్యం దిగుబడి రాలేదు. సాధారణంగా ఎకరాకు 40 బస్తాలు రావాలి. పంట చేతికొచ్చే దశలో బోరు బావి లో నీరందక దిగుబడి తగ్గింది. కొనుగోలు కేంద్రం ఏర్పాటు అయ్యేటప్పటికీ గింజ బరువు తగ్గి, పంట సాగు కోసం చేసిన పెట్టుబడి డబ్బులు వస్తే అదే గొప్ప.

– సురేశ్, రైతు, సీతారాం తండా

పంట సాగు చేసిన నాటి నుంచి రోగాలే



ఈసారి వరి పంటకు వచ్చినన్ని రోగాలు ఎప్పుడు రాలేదు. రూ.వేలు ఖర్చు పెట్టి పంటపై మందులు పిచికారీ చేయడం, పంట ఎదుగుదలకు ఎరువులు, గుళికలు చల్లిన ఫలితం లేకుండా పోయింది. కంకికి సగం గింజలు మాత్రమే మిగిలాయి. మరికొంత పూర్తిగా ఎండిపోయింది. ఆరుగాలం కష్టించి ఇంటిల్లిపాది కష్టపడ్డ లాభం లేకుండా పోయింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– లాల్ సింగ్, రైతు, వరిగుంతం

ఒకే పంట సాగుతో నష్టం



యాసంగిలో నీటి ఎద్దడి ఉంటుందన్న విషయం తెలిసిందే. ఆరుతడి పంటలకు ఇక్కడి భూములు అణువుగా ఉన్నా.. రైతులు మాత్రం నీటి ఆధారిత పంట వరి వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అవగాహన కల్పించినా.. వారు యథావిధిగా వరి పంట సాగు చేసి, నష్టాలు చవి చూడాల్సి వస్తుంది.

– శ్వేత కుమారి, ఏఓ, కొల్చారం

క్లుప్తంగా

బీజేపీ ఇంటింటి ప్రచారం


అల్లాదుర్గంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో ఆదివారం బీజేపీ నాయకులు బీజేపీ ఓటు వేయాలి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీతోనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో విఫలమయిందని విమర్శించారు. జహీరాబద్ ఎంపీగా బీబీపాటిల్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు, సాయిలుగౌడ్, బాలు, బ్రహ్మం, రమేశ్, భాస్కర్‌రెడ్డి, కిష్టయ్య, అశోక్, సంతోశ్ పాల్గొన్నారు.

జీడిపల్లిలో స్వచ్ఛభారత్


మొక్కలకు నీళ్లు పడుతున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లి గ్రామ యువత ఆదివారం 9వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి గ్రామంలోని నర్సరీ వద్ద శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించి, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం మొక్కలకు నీటిని పట్టారు.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట(మెదక్): పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మజీద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సరాపు యాదగిరి, పార్టీ పట్టణాధ్యక్షుడు నాగరాజు, ముస్లీం మత పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పశుపక్షాదులకు నీటిని అందించాలి: ఎంపీడీఓ


నీటి తొట్టిని నింపుతున్న ఎంపీడీఓ చిన్నారెడ్డి

చేగుంట(తూప్రాన్): వేసవిని దృష్టిలో ఉంచుకొని పశుపక్షాదులకు నీటి ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వడియారం గ్రామంలోని పశువుల తొట్లను పంచాయతీ సిబ్బంది సాయంతో నీటితో నింపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చిన్నారెడ్డి మాట్లాడుతూ.. మండుతున్న వేసవిలో మూగ జీవాలైన పశువులతో పాటు పక్షులను నీటి ఏర్పాట్లు చేస్తే బాగుంటుందన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మాత్రమే కాకుండా ప్రజలు సైతం మూగజీవులను కాపాడే ప్రయత్నంలో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వడియారం గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం


మనోహరాబాద్‌లో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్ వీర హనుమాన్ దేవాలయం వద్ద హనుమాన్ మాలధారులు 108 సార్లు ఆదివారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు మాలధారులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలధారులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


చిలప్‌చెడ్(నర్సాపూర్): అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు


కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మదేవి ఆలయానికి విరాళం ఇస్తున్న భిక్షపతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారితో పాటు ఆలయంలోని బ్రహ్మి, కాళి, వైష్ణవి అమ్మవార్లను దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించమన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం భక్తులతో రద్దీ నెలకొంది. ఉదయం ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శివ్వంపేట మండలం దొంతికి చెందిన భిక్షపతి ఆలయ అభివృద్ధికి రూ.10వేలు ఇచ్చారు. ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాములు, పర్వతాలు, ప్రభాకర్‌చారి తదితరులు ఉన్నారు.

ముగిసిన సికింద్లాపూర్ బ్రహ్మోత్సవాలు


కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఏటా ధనుర్మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ప్రతీ ఆదివారం జాతర ఉగాది వరకు జరుగుతాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలు చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి గుట్టపై కొలువైన స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి, సిబ్బంది ఉన్నారు.

పోలీసుల కవాతు

పాపన్నపేట(మెదక్): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని మల్లంపేట గ్రామంలో కేంద్ర దళాలు, పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష


నర్సాపూర్ రూరల్: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఆదివారం మోడల్ స్కూల్ ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగిందని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జయప్రకాశ్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకోసం 128 మంది దరఖాస్తు చేయగా, 120 మంది హాజరయ్యారు. 7వ తరగతికి 14 మందికి 11 మంది, 8వ తరగతికి 22 మందికి 21 మంది, 9వ తరగతికి 19 మందికి 19 మంది, పదో తరగతికి 6 మందికి 5 గురు విద్యార్థులు హాజరయ్యారు. మొత్తానికి 6వ తరగతికి 94 శాతం, 7 నుంచి 10 తరగతులకు 92 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు 6 తరగతి ప్రవేశ పరీక్ష జక్కపల్లి మోడల్ స్కూల్, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షా కేంద్రాన్ని ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ పర్యవేక్షించారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మోడల్ పాఠశాలలో ఏడు నుంచి పదోతరగతి మిగిలిపోయిన సీట్ల ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షలను చేగుంట ఉన్నత పాఠశాల హెచ్ఎం మండల నోడల్ అధికారి నీరజ పర్యవేక్షణ నిర్వహించారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. 134 మంది పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆరోగ్య దినోత్సవంపై అవగాహన ర్యాలీ

పెద్దశంకరంపేట(మెదక్): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆర్యోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది యాదయ్య, వెంకటేశం, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రాజు



టేక్మాల్(మెదక్): బీజేపీ మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా టేక్మాల్‌కు చెందిన ఎల్లుపేట రాజుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. ఇందులో టేక్మాల్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు వడ్డె రాములు, యువ మోర్చా అధ్యక్షులు పవన్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు సేనాపతి ఉన్నారు.

◆ నిత్యాన్నదానానికి విరాళం



శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న నిత్య అన్నదానానికి నర్సాపూర్ బీవీఆర్ఐటీ కుటుంబ సభ్యులు రూ.లక్ష 53 వేల 348 విరాళం అందజేశారు. ఆదివారం ఆంజనేయస్వామిని బీవీఆర్ఐటీ అధినేత విష్ణురాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రభుశర్మ, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

◆ యువకుడి అదృశ్యం



టేక్మాల్(మెదక్): యువకుడి అదృశ్యమైన ఘటన మండల కేంద్రం టేక్మాల్‌లో ఆదివారం వెలుగు చూసింది. ఎస్ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ గ్రామానికి చెందిన బాజ గణేశ్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 2న ఫొటోలు దింపే పని మీద వేరే గ్రామానికి వెళ్తున్నా అని చెప్పి వెళ్లాడు. రెండు రోజులు అనంతరం కుటుంబ సభ్యులు గణేశ్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు గణేశ్ రెడ్ టీషర్ట్, బ్లూ కలర్ జీన్స్ పాయింట్ వేసుకున్నట్లు తెలిపారు. గణేశ్ తండ్రి కిష్టయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శిగా నోముల శ్రీకాంత్ ముదిరాజ్ నియామక ఆదివారం నియమించారు. ఆదివారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు రామకిష్టయ్య సమక్షంలో జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి అక్షయ్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. మూగ లక్ష్మయ్యముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా బోనాల ఊరేగింపు


పెద్దశంకరంపేటలో బోనాల ఊరేగింపు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం మండల కేంద్రంలోని బేస్తగల్లిలో దుర్గమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం గ్రామ పురవీధుల గుండా మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళి, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, గ్రామపెద్దలు గంగారెడ్డి, దశ్వంత్, సత్యనారాయణ, నీలకంటి విఠల్, సీతారం, పున్నయ్య, మల్లేశం పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం


బండపోతుగల్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సాహసం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పారం ప్రకాశ్ అన్నారు. ఆదివారం మండలంలోని బండపోతుగల్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహదాత బలవంత్‌రెడ్డి, ఎంఆర్‌పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవయ్య, చెట్లపల్లి యాదగిరి ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు భూచంద్ర, నాయకులు డప్పు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, ప్రభాకర్, పద్మ, కృష్ణ, బాల్‌రాజ్, సత్యం, ఎంపీటీసీ మల్లయ్య, మాజీ సర్పంచ్ ఈస్తారీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రఘునందన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


రామాయంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ కార్యకర్తలు ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ దేశానికి మళ్లీ ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించడం ఖాయమని, మనం పార్టీల కతీతంగా మోదీని సమర్థించాలని అభ్యర్థించారు. ఇప్పుడు జరిగే ఎన్నికలు దేశం కోసమని, దేశం బాగుండాలంటే బీజేపీ అభ్యర్థులనే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యకర్తలు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రచారంలో పార్టీ సీనియర్ నాయకుడు శంకర్‌గౌడ్, కొడపర్తి నరేందర్, లావణ్య, యాదగిరి, సతీశ్‌రావు, సావమి, గిరి, అనిల్ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

మనోహరాబాద్(తూప్రాన్): బీజేపీ మండల నాయకులు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి రఘునందన్ రావుని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్ చారి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, గోపాల్, మల్లేశ్, కృష్ణ, సత్యం, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మొద్దు


చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సిబ్బంది


టేక్మాల్(మెదక్): కుసంగిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న రైతు సంఘం సీఈఓ వెంకటేశం


కౌడిపల్లి(నర్సాపూర్): నాగ్సాన్‌పల్లిలో ..


నిజాంపేట(మెదక్): నందిగామలో..

టేక్మాల్(మెదక్): రైతులు దళారులను నమ్మొద్దు అని రైతు సంఘం సీఈఓ వెంకటేశం తెలిపారు. ఆదివారం టేక్మాల్ మండలంలోనే కుసంగి, కోరంపల్లి, శేరిపల్లి గ్రామాల్లో మండల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో ఏఈఓ ఇంద్రయ్య, సంఘం అధ్యక్షుడు మొగులయ్య, నాయకులు మోగుల్‌రెడ్డి, అంజయ్య, వీరారెడ్డి, మోహన్‌రెడ్డి, రాములు, నాగరాజు, సత్యగౌడ్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని సోమక్కపేట్, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, జగ్గంపేట్ చండూర్, చిలప్‌చెడ్, రాందాస్‌గూడ, గౌతాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించామని పీఏసీఎస్ సీఈఓ పోచయ్య అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): రామాయంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలోని మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేశారు. మండల పరిధిలోని చల్మెడ, నందగోకుల్, నస్కల్, రాంపూర్, నార్లాపూర్, తిప్పనగుల్ల గ్రామాల్లో ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.

మట్టిపెడ్డలు లేకుండా తేవాలి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లి, తిమ్మాపూర్, హరిచంద్‌తండా పంచాయతీల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఎరువుల డీలర్ భిక్షపతి, నరహరి, రైతులు లక్ష్మయ్య, రాములు, శ్రీనివాస్, రవి, రాజ్‌కుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి(తూప్రాన్): పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి వెల్దుర్తి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం, సొసైటీ సీఈఓ సిద్ధయ్య, వ్యవసాయశాఖ ఏఓ రాజశేఖర్‌లు వేర్వేరుగా, వెల్దుర్తి ఏఓ ఝాన్సి, ఏఈఓ రజిత, రేవతి తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సీఈఓ సందీప్ ఆధ్వర్యంలో చేగుంట, వడియారం, అనంతసాగర్, ఉల్లితిమ్మాయిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మణ్, విష్ణు, రైతులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని మడూర్ సహకార సంఘం సీఈఓ కృష్ణా కోరారు. ఆదివారం మడూర్ సహకార సంఘం పరిధిలోని మడూర్, శాలిపేట, ఖాజాపూర్, మిర్జాపల్లి, టీ.మాందాపూర్, ఎస్.కొండాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది రవితేజ, కిషన్ పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ఐదు గ్రామాల్లో ఏకలవ్య రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సంఘాలకు చెందిన సీఈఓలు ఆయా గ్రామాల సీఈఓలు నవీన్, సాయిరెడ్డి, జనార్దన్ రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.